క్లుప్తంగా

సీఎస్‌ఆర్‌ఎంఓగా డాక్టర్ పద్మజ



డాక్టర్ వి.పద్మజ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో నూతన సివిల్ సర్జన్ ఆర్‌ఎంఓ (సీఎస్‌ఆర్‌ఎంఓ)గా డాక్టర్ వి.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌పై పదోన్నతిలో భాగంగా శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ వి.పద్మజను పదోన్నతిపై కర్నూలుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడమే తన ప్రధాన లక్ష్యమని, వైద్య సిబ్బంది సహకారంతో ఆసుపత్రి సేవల స్థాయిని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఆమెను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు, అధికారులు, సిబ్బంది అభినందించారు.

జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎంపిక

కర్నూలు(సెంట్రల్): అఖిల భారత విద్యా హక్కు వేదిక జాతీయ కార్యవర్గ సభ్యులుగా కర్నూలుకు చెందిన పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు నియామకమైనట్లు పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 10 నుంచి 12వ తేదీ వరకు అఖిల భారత విద్యా వేదిక జాతీయ కౌన్సిల్ సమావేశాలు పంజాబ్‌లోని జలంధర్ గదర్ పార్టీ కాన్ఫరెన్స్ హాలులో జరిగాయని, అందులో ఏపీ నుంచి భాగస్వామ్యం వహించిన పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎంపిక కావడం సంతోషకరమని వివరించారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. శుక్రవారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో రమ ఏకాదశి పూజలు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు భగవద్గీతలో పరిష్కారం దొరుకుతుందన్నారు. వైదిక ధర్మం, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. హరే రామ.. హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీజేపై దాడి ఘటనపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై దాడి జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షురాలు మీసాల సుమలత శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన చెస్ పోటీలు

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో.. రాజవర్ధన్ రెడ్డి జయంతి సందర్భంగా నిర్వహించిన అంతర్జాతీయ చదరంగం పోటీలు ముగిశాయని కేడీసీసీబీ చైర్మన్, పోటీల ఆర్గనైజింగ్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే దస్తగిరి, మాజీ ఎమ్మెల్యే గఫూర్ హాజరై పోటీలను పరిశీలించారు. కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలత, నాగేశ్వరయాదవ్, చంద్రశేఖర్, ఐకాన్ చెస్ అకాడమీ చైర్మన్ శివరామిరెడ్డి, శ్రీలక్ష్మీ విద్యాసంస్థల డైరెక్టర్ కార్తీక్, శ్రావ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పత్తికొండ: కుటుంబ సమస్యలతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నకు యత్నించిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక 13వ వార్డుకు చెందిన బారిక గోరంట్ల, నాగమ్మ దంపతుల కుమారుడు బారిక రవి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూల్‌కు తరలించారు.

పేదలకు వైద్య విద్య అందకుండా కూటమి కుట్రలు

- 37వ వార్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం
- ప్రారంభించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసేలా కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు.. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం కల్లూరు అర్బన్ 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలు ప్రారంభించారన్నారు. దీంతో పేద విద్యార్థులు వైద్య విద్యను చదవడంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో సీఎం చంద్రబాబు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమనికి శ్రీకారం చుట్టిందని వివరించారు. పేదలు వైద్య విద్య చదువుకోవడం కూటమి నాయకులకు ఇష్టం లేదన్నారు. ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం చేసే విధంగా వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా హెల్త్ సెంటర్లను ప్రారంభించామన్నారు. 2024 ఎన్నికల సభలలో చంద్రబాబు వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు అందిస్తామని ఊదరగొట్టారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు అవుతున్నా ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకు పింఛన్ వంటి పథకాలకు మొండిచెయ్యి చూపారని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో వీధి వీధిలో బెల్ట్ షాపులు ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని, కూటమి నాయకులే నకిలీ మద్యం తయారుచేసి షాపుల్లో అమ్ముతున్నారని, ప్రజారోగ్యం వారికి పట్టదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వెంకటేశ్వర్లు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి, శ్రీనివాసులు, నాయకులు షరీఫ్, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాధవ స్వామి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తరలించాలి

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని గోల్డెన్ అవర్ (మొదటి గంట)లో ట్రామా సౌకర్యాలున్న ఆసుపత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడేందుకు అవకాశం ఉంటుందని న్యూరోసర్జన్ డాక్టర్ విశ్వకుమార్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మంజునాథ్ చెప్పారు. ప్రపంచ ట్రామా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5 కోట్ల మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతున్నారని, అందులో 50 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. దేశంలో నాలుగు నిమిషాలకో వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన గంట లోపు సరైన చికిత్స అందించగలిగితే కాపాడే అవకాశాలు 80 శాతం వరకు పెరుగుతాయని చెప్పారు. క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి, ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ సునీల్, న్యూరోఫిజీషియన్ డాక్టర్ రఘునందిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే థామస్ క్షమాపణ చెప్పాలి



వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి

కర్నూలు టౌన్: చిత్తూరు జిల్లా మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తె వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు కృపలక్ష్మీని వ్యంగ్యంగా తీవ్రమైన పదజాలంతో దూషించిన నెల్లూరు కూటమి ఎమ్మెల్యే థామస్ వెంటనే క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కల్తీ మద్యంతో మందుబాబులు రెచ్చిపోతున్నారన్నారు. అడుగడుగునా బెల్ట్ షాపులతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. బహిరంగంగా, రోడ్ల మీదే మద్యం సేవిస్తూ మహిళలను ఇబ్బందులు పెడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. వీటిని కట్టడి చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు చేశామని గుర్తు చేశారు. అలాగే వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు కృపలక్ష్మీ ధర్నా నిర్వహిస్తే జీర్ణించుకోలేక అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే హేళనగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళలను గౌరవించాలన్న ఇంగిత జ్ఞానం లేకపోవడం సిగ్గుచేటన్నారు. క్షమాపణలు చెప్పకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు.

పదోన్నతి పొందిన వారికి సన్మానం



సన్మానం పొందిన అధికారులతో ఉద్యోగులు

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఇటీవల పదోన్నతి పొందిన వివిధ కేడర్ల అధికారులను జిల్లా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఇందులో జిల్లా మాస్ మీడియా అధికారిగా పదోన్నతి పొందిన ఎస్.ప్రకాష్‌రాజు, కమ్యూనికేషన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన పి.శ్రీనివాసులు శెట్టి, హెచ్‌ఈఈఓగా పదోన్నతి పొందిన సీఎం చంద్రశేఖర్ రెడ్డి, ఎస్.బాబా ఫక్రుద్దీన్, కె.రవీంద్ర నాయక్ ఉన్నారు. కార్యక్రమంలో కమ్యూనికేషన్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ పద్మజ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్స్ శ్రీనివాస యాదవ్, సుభాషిణి, పద్మావతి, స్వర్ణ గౌరి, ఈశ్వరయ్య, కృష్ణారెడ్డి, పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి'పై వేధింపులు తగదు

కర్నూలు(సెంట్రల్): 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ పి.ధనుంజయరెడ్డి, వివిధ జిల్లాల్లో పనిచేసే రిపోర్టర్లపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధించడం తగదని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో ఖండించారు. పత్రిక స్వేచ్ఛపై దాడి చేస్తే ప్రజాసంఘాలు ఊరుకోవని స్పష్టం చేశారు. అక్రమ కేసులు పెట్టి వివరణ ఇవ్వాలని పత్రిక కార్యాలయంలోకి పోలీసులు చొరబడడం అన్యాయమని వాపోయారు. నోటీసులు ఇవ్వాలనుకున్న పోలీసులు ఇంటి గేటు లేదా కార్యాలయం గేటుకు అతికించి వెళ్లిపోవచ్చని పేర్కొన్నారు. అయితే నెల్లూరు పోలీసులు మాత్రం రెండు రోజులుగా నోటీసులు ఇచ్చే నెపంతో ఎడిటర్ కార్యాలయంలో సోదాలు చేయడం దారుణమని మండిపడ్డారు. అక్కడ పనిచేసే సిబ్బందిని భయభ్రాంతులకు గురి చేయడం ఘోరమని, కూటమి ప్రభుత్వంలో పోలీసులు నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల పీఎం మోదీ పర్యటన సందర్భంగా ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులపై అక్రమంగా కేసులు పెట్టారని, అందులో భాగంగానే 'సాక్షి' దినపత్రికలో వచ్చే కథనాలకు వివరణ ఇచ్చుకోలేక కేసులు పెడుతున్నారని, ఇది కూటమి ప్రభుత్వానికి తగదని సూచించారు. ప్రభుత్వం తన పద్ధతి మార్చుకోకపోతే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో నిధుల దుర్వినియోగంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్‌పీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌యూ అవినీతి, అక్రమాలకు నిలయంగా మారిందని ఆరోపించారు. అవినీతి పరుడైన వ్యక్తిని రిజిస్ట్రార్‌గా అక్రమంగా కొనసాగించడం సిగ్గుచేటని ఆరోపించారు. అక్రమార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఇష్టానుసారంగా ఎలాంటి టెండర్లు లేకుండా తమకు నచ్చిన వారికి కాంట్రాక్టులు ఇస్తూ కమీషన్లకు కక్కుర్తి పడి వర్సిటీ పరువును బజారు పాలు చేస్తున్నాడని మండిపడ్డారు. సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్లలో నిబంధనలు పాటించలేదని, విద్యార్థుల ఫీజులతో నాన్‌టీచింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంతో వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రిజిస్ట్రార్ అవినీతి అక్రమాలపై వర్సిటీ వీసీకి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుత రిజిస్ట్రార్ హయాంలో వర్సిటీ నాల్గవ కాన్వొకేషన్ నిర్వహిస్తే అందులో భారీ మొత్తంలో అవినీతికి పాల్పడే అవకాశం ఉందన్నారు. విధుల నుంచి తొలగించిన ఆరుగురు టీచింగ్ ఫ్యాకల్టీని విధుల్లోకి తీసుకోకపోతే వర్సిటీ బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. నాయకులు శ్రీనాథ్, జగదీష్, జగన్, సందీప్, కౌసిక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభ విజయవంతంపై అభినందన

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభ విజయవంతమైందని, ఈ సభ విజయవంతం కోసం కృషి చేసిన మంత్రులు, ఉన్నతాధికారులు, జిల్లా అధికారులను అభినందిస్తున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. ఆయన శుక్రవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పీఎం సభా ఏర్పాట్లలో పాలుపంచుకున్న మంత్రులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీశైల మల్లన్న దర్శనంతో ప్రధానమంత్రి ఎంతో సంతోషించారని, జీఎస్టీ సభ ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు సీఎం చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీఓ సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఆసుపత్రి అధికారులు పొట్ట కొడుతున్నారు



లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు తమ పొట్టకొడుతున్నారని లోడింగ్, అన్‌లోడింగ్ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆసుపత్రిలో సీఐటీయూ నగర ఉపాధ్యక్షుడు, హమాలీ యూనియన్ సెక్రటరీ నాగరాజు మాట్లాడుతూ.. కర్నూలు నగర పరిధిలోని బుధవారపేట ప్రాంతంలో నివాసముండి గత 30 ఏళ్లుగా కార్మిక శాఖ కార్యాలయంలో యూనియన్‌గా రిజిస్టర్ చేసుకుని లోడింగ్, అన్‌లోడింగ్ పనుల ద్వారా ఉపాధి పొందుతున్నామని వివరించారు. కర్నూలు మ్యూజియం నుంచి హంద్రీ బ్రిడ్జి, కేసీ కెనాల్, వినాయక టెంపుల్ వరకు, బుధవారపేట నుంచి లక్ష్మీ గార్డెన్ వరకు హమాలీ పని చేసుకుంటూ 60 మంది కార్మికులు కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. ఇటీవల ఆసుపత్రి అధికారులు వస్తువులు, మెటీరియల్ వస్తే తమకు చెప్పకుండా అక్కడ క్లీనింగ్ కోసం ఏర్పాటు చేసుకున్న శానిటేషన్ వర్కర్స్‌ను భయపెట్టి లోడింగ్, అన్‌లోడింగ్ పని చేయించుకుంటూ తమ కడుపు కొడుతున్నారని విమర్శించారు. ప్రధాన మంత్రి సూపర్ జీఎస్టీ సభకు వస్తువులు లారీల ద్వారా వస్తే వాటిని పోలీసుల సమక్షంలో శానిటేషన్ వర్కర్స్‌తో అన్‌లోడింగ్ చేయించారన్నారు. దీనివల్ల తాము ఉపాధి కోల్పోయి నష్టపోయామన్నారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరంలో ఒక సంవత్సరం పీజీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లోకనాథ ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలో నాలుగు సంవత్సరాల ఆనర్స్‌తో కూడిన యూజీ డిగ్రీ, ఒక సంవత్సరం పీజీ ప్రోగ్రాం (లేటర్ ఎంట్రీ)లో బీఎస్సీ/బీకాం/బీఏ/బీబీఏ/బీసీఏ ఆనర్స్ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 25వ తేదీలోగా వర్సిటీలో దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.

పెద్దాసుపత్రికి స్ట్రెచర్లు, వీల్‌చైర్ విరాళం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి 47వ జయంతి పురస్కరించుకుని శుక్రవారం విష్ణు సేన ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు 4 స్ట్రెచర్లు, ఒక వీల్ చైర్, రోగులకు బెడ్‌షీట్లను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా వైద్య సేవలకు తోడ్పడుతున్న విష్ణు సేన సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులు రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు విషయంలో కూటమి పాత పాటే!

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని కూటమి నాయకులు పాత పాటే పాడారని ఇలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సింగరాజు లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. 15 ఏళ్లుగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నా కర్నూలులో హైకోర్టు లేదా బెంచ్‌ను ఏర్పాటు చేయలేదన్నారు. 2014 ఎన్నికల్లో గెలిపిస్తే వెంటనే బెంచ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. 2025 ఎన్నికల్లో గెలిచి 16 నెలలు అవుతున్నా ఎందుకు హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు.

ఇంత ఆర్భాటం అవసరమా?

కర్నూలు(సెంట్రల్): దేశ ప్రజలపై 8 సంవత్సరాలుగా జీఎస్టీ పేరుతో పన్నుల భారం వేసి ఇప్పుడు తగ్గించామని ఆర్భాటాలు చేయడం అవసరమా అని.. మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ఎం.సుధాకరబాబు శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ప్రభుత్వ సభకు బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఎలా వస్తారని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం ప్రజలను వదిలివేసి మోదీ సభ కోసం పాఠశాలలకు సెలవులు ఇచ్చి బస్సులను తీసుకెళ్లడం దారుణమన్నారు. మోదీ కోసం జిల్లా అంతటా ఉన్న పాఠశాలలకు రెండు రోజులు సెలవులు ఇవ్వడం అన్యాయమన్నారు.

భోజనాలు పెట్టలేదు..

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సభకు మహిళలను తీసుకెళ్లి ఆకలితో ఇబ్బంది పెట్టారని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. బెదిరించి మెప్మా, డీఆర్‌డీఏల పరిధిలో ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను తరలించిన అధికారులు వారికి సౌకర్యాలు కల్పించడం విఫలమయ్యారన్నారు. కనీసం భోజనం పెట్టలేదని, కొందరికి పాచిపోయిన భోజనాలు అందించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు.

పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ పరీక్షల విభాగం నిర్వహణలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అనేకమార్లు ప్రశ్నా పత్రాలు లీక్ అయినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. పెండింగ్‌లో ఉన్న అవినీతి నివేదికలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల విభాగాన్ని భ్రష్టు పట్టిస్తూ అవినీతికి పాల్పడుతున్న పరీక్షల విభాగం అధికారిపై చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. పరీక్షల విభాగాన్ని ప్రక్షాళన చేయకపోతే దశలవారీ ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. నాయకులు సందీప్ నాయక్, ఓబులేష్, కిరణ్, తేజ, కరుణాకర్, గణేష్, దాసు, ప్రశాంత్, కృపాకర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరి



నగరపాలక భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్‌రావు

కర్నూలు టౌన్: ప్రజాధనంతో చేపట్టే నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత తనిఖీ చేశాకే బిల్లులు చేయాలని రాష్ట్ర ప్రజారోగ్య సాంకేతిక శాఖ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్ రావు ఆదేశించారు. ఆయన శుక్రవారం నగరపాలక నూతన భవన కార్యాలయం, సుంకేసుల జలాశయం నుంచి ఎస్ఎస్ ట్యాంకు పైపులైన్ పనులను పరిశీలించారు. పనుల జాప్యానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పైపులైన్ నిర్మాణ పనులు, నూతన కార్యాలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ అనంతపురం సర్కిల్ ఎస్ఈ రాంమోహన్ రెడ్డి, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

లేఔట్లను క్రమబద్ధీకరించుకోండి

ఈ నెల 23వ తేదీ లోపు అనధికార లేఔట్లను క్రమబద్ధీకరించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 1,180 దరఖాస్తులు అందుకున్నట్లు చెప్పారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీఎస్ అంజాద్ బాష పాల్గొన్నారు.

ఆదిత్యుడికి సుంగధ ద్రవ్యాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ స్వామి

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్వయుజ మాసం తులా సంక్రమణం పురస్కరించుకొని ఆదిత్యుడికి క్షీరాభిషేకం, సుంగధ ద్రవ్యాభిషేకం, అర్చనలు తదితర పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు నిర్మించాలి



మట్టి రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డు ఉమామహేశ్వరి నగర్‌లో సీసీ రోడ్లు నిర్మించాలని సీపీఎం నాయకులు సుధాకరప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం వార్డులోని ఉమామహేశ్వరి నగర్, ఫారుక్ నగర్ కాలనీలో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించి, ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 35వ వార్డులోని కాలనీల్లో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. సీపీఎం నాయకులు రామాంజనేయులు, అయ్యప్ప, సురేష్, శ్రీనివాసులు, అక్బర్ బాష, చిట్టిబాబు, గోపీనాథ్, గంగావతి, లక్ష్మి, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీ కృష్ణ దేవరాయల జయంతి, పట్టాభిషేక మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నగర బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మన్న, రవికుమార్ కోరారు. శుక్రవారం రాయల 496వ వర్ధంతి సందర్భంగా సంఘం నేతలు ఆయన విగ్రహానికి గజమాలను వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువలు తవ్వించి, దేవాలయాలు నిర్మించి తెలుగు నేలపై రాయలు విశేషమైన కార్యక్రమాలను చేపట్టారన్నారు. అలాగే తెలుగు భాష వైభవాన్ని పెంపొందించారని కొనియాడారు. నగరంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన కాపు భవన్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలన్నారు. కాపు కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు విడుదల చేయాలన్నారు. కాపు నాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామక్రిష్ణ, ప్రధాన సలహాదారు సింగంశెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఓంకార్, ఆంజనేయులు, శ్రీనివాసులు, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం

కర్నూలు(అగ్రికల్చర్): ఈ నెల 16న ప్రధాని నరేంద్రమోదీ బహిరంగ సభ వేదిక సమీపంలో విద్యుత్ షాక్‌తో మరణించిన ఎం.అర్జున్ కుటుంబానికి విద్యుత్ శాఖ రూ.5 లక్షల పరిహారం అందించింది. శుక్రవారం కర్నూలు మండలం మునగాలపాడు గ్రామానికి వెళ్లి రూ.5 లక్షల చెక్కును అర్జున్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్‌కుమార్ ఉన్నారు. అర్జున్ (15) అత్యుత్సాహం వల్లనే విద్యుత్ షాక్‌కు గురైనట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ తెలిపారు. అవగాహన లేమితో ఫొటో షూట్ చేసే క్రమంలో 18 అడుగుల ఇనుప రాడ్డు కలిగిన జెండాను అటు, ఇటూ ఆడిస్తూ ముగ్గురు స్నేహితులతో బైక్‌పై నిలబడి సభా ప్రాంగణానికి వెళ్లేందుకు ప్రయత్నించారన్నారు. విద్యుత్ సిబ్బంది వారిస్తున్నా అలాగే వెళ్లి వేదికకు విద్యుత్ సరఫరా అందించే 11 కేవీ లైన్‌కు తగిలి ప్రమాదవశాత్తు మరణించారని ఎస్ఈ చెప్పారు. తమ తప్పేమీ లేదు.. ఆ బాలుడే అత్యుత్సాహంతో వ్యవహరించి విద్యుత్ షాక్‌కు గురయ్యారని పేర్కొనడం గమనార్హం. విద్యుత్ షాక్‌తో జనసేన కార్యకర్త మరణించినప్పటికీ ఆ పార్టీ అధ్యక్షుడి నుంచి కనీస సానుభూతి కూడా వ్యక్తం కాకపోవడం పట్ల పలువురు ఆవేదన చెందుతున్నారు.